# సినీ బేతాళ కథలు





## – డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 17 -

## - గగుర్పాటవం -

**బేతాళుడి శవాన్ని** విక్రమార్కుడు మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు. 'ఓ విక్రమార్కా! నీకు శ్రమతెలియకుండా వుండేందుకు యింకో కథ చెబుతాను విను –' అని బేతాళుడు ప్రారంభించాడు –

"అనగనగా అంటూ పాడగా పాడగా తెలుగు సినిమాల్లో పాటలు రాయడానికి గగుర్పాటుశ్రీ అనే పాటల రచయిత ప్రాచుర్యం సంపాదించాడు. అతని పాటలు వింటే శ్రోతలకు గగుర్పాటు కలిగి రోమాలు నిక్కబొడుచుకునేవి. అతను అన్నిరకాల పాటలూ రాసేవాడు.

గగుర్పాటుశ్రీ కొన్ని పాటలు వులికిపాటు కలిగించి జనం వులిక్కిపడేవారు. అప్పుడు అతన్ని వులికి పాటశ్రీ అనేవారు. కొన్నిపాటలకు ఆవులింతలొచ్చి నిద్రపోయేవారు. అప్పుడతన్ని కునుకు పాటశ్రీ అనేవారు. కానీ అతడు గగుర్పాటుశ్రీగానే గణుతికెక్కాడు.

గగుర్పాటుశ్రీకి యితర పాటల రచయితలన్నా, యితర పాటలన్నా పడేదికాదు – ఎవరేనా తెలుగు సినిమా పాటల గురించి మీ అభిప్రాయం ఏవిటిసార్? – అనడిగితే – అవో వొక పాటలేనా, అంటే నేను రాసినవి కావు. అవీ వొక రాగాలేనా – అంటే నా పాటల ట్యూన్స్‌కావు – పాత పాటలైనా, కొత్త పాటలైనా ఒక్కలాగే ఏడుస్తున్నాయి. వాడెవడో 'మదిలో పూసే రోజా!' అని రాశాడు. మనస్సు వొక శూన్యప్రదేశం – అదేవీ పూలకుండీకాదు. మరి అందులో రోజా పుయ్యడవేమిటీ!' అలాగే యింకోడు 'మనసున మల్లెల మాల లూగెనో' అని రాశాడు. అదుగో మళ్ళీ మనసు శూన్యప్రదేశం – అందులో మాలలు, రాజులు, బ్రాహ్మలు వుయ్యాల కట్టుకుని ఎలా వూగుతారు? యిలా వాడెవడో రాసేయడం యింకోడెవడో ట్యూన్ కట్టేయడం – చచ్చచ్చ – తెలుగు సినిమా పాటల్ని రకరకాలుగా ధ్వంసం చేసేస్తున్నారయ్యా. ఇక కొత్త పాటల గురించి చెప్పక్కర్లేదు – అది యింగ్లీషు మాటో తెలీదు. తెలుగు మాటో తెలీదు. అంతా జిబిరిష్. మరి నా పాటలు విను. పాటంటే చెవిలో కత్తిలా గుచ్చుకు పోవలిసిందే" అని లెక్చరిచ్చేవాడు గగుర్పాటుశ్రీ అతను తెలుగు సినిమాల్లో నిలదొక్కుకోడానికి చాలా యిబ్బందులు పడ్డాడు. చాలా సంవత్సరాలు తమిళ డబ్బింగు సినిమాలకి రాసేవాడు. అలా రాయగా

రాయుగా నెమ్మదిగా తెలుగు స్ట్రెయిట్ సినిమాలు రాయడానికి అవకాశం వచ్చింది. గగుర్పాటుశ్రీ తెలుగులో పాటలు రాసే టైముకి ప్రేక్షకుల చెవులు చెట్టెక్కేసి, కళ్ళకు పుష్టొస్తన దృశ్యాలు మృష్టాన్న భోజనాలయి పోయాయి. పాటల్లో మాటలెలావున్నా శబ్దవిన్యాసాలకు ఆదరణ పెరిగి, సాహిత్యం సన్యాసం పుచ్చుకుంది.

ఎన్నో యేళ్ళు డబ్బింగ్ పాటలు రాయడానికి అలవాటు పడిపోయిన గగుర్పాటశ్రీకి తన మొదటి స్ట్రెయిట్ టేక్ చిత్రానికి పాట రాయడం నల్లేరు నడకైపోయింది. తన దగ్గరున్న మసాలా అంతా వాడి గగుర్పాటశ్రీ మొట్టమొదటి సొంత తెలుగు పాట రాశాడు. ఆ పాట హిట్టయి, భాషతో పనిలేని కేంద్రం వారు వుత్తమ గీతంగా వొక అవార్డు తయారుచేసి ఇచ్చారు. అయితే పాట విన్న, పేరెన్నికగన్న తెలుగు గీత రచయితలంతా యిక బ్రతికినా వొకటే, పోయినా వొకటే అని కిరోసినాయిల్ షవర్ తీసుకుని అగ్గిపుల్ల గీసుకోబోయారు. నా సినిమాకి పాటిచ్చాక చద్దురుగాని, ఆపండి , అని వారినిర్మాతలు, గీతరచయితలు వాయిదా ప్రయత్నం వాయిదా వేసేసారు.

- ఇప్పుడు చెప్పు విక్రమార్కా! సెంట్రల్ అవార్డు వచ్చినా, తెలుగు సినీ గీత రచయితలందర్నీ కలవర పరచిన ఆ పాట ఏవిటి? ఆ పాటలో లోటేవిటి? ఆ పాట ఎందుకంత కలకలం సృష్టించింది? - ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసే సమాధానం చెప్పకపోతే, తెలుగు సినిమాపాటకు తన్మయంగా వూగకుండా నీ తల తక్షశిల అయిపోతుంది -" అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు, - "ఓ బేతాళా! గగుర్పాటశ్రీకి డబ్బింగ్ చిత్రాలకు రాయడం బాగా అలవాటయిపోయి, తన మొట్టమొదటి స్ట్రెయిట్ తెలుగు చిత్రానికి కూడా అలాగే రాసాడు. ఆ పాట హీరో, హీరోయిన్‌తో పెళ్లి ఫిక్సవగానే ఆనందోత్సాహంతో వొంకర్లు తిరిగిపోతూ పాడినపాట. ఆ లిరిక్స్ యివీ, -

'అపుడైతే నాపై నువ్ ప్రేమ జల్లినావ్

అహ ప్రణయంబల్లినావ్, కమిలిపోయె నా హృదయం, కదిలిపోయె నా వుదరం,

త్రుళ్ళిపడే నా ఉల్లం కళ్యాణం గానం విని

పారైవే నీలోని కలవర పాటున్

తోసైవే నీలోని తొణికిసలాటన్,

పదం వినవే - అహ నా పదం వినవే!

- యిలా రాసి రంపాన పెట్టేసాడు.

నేను భగవద్గీత రచయితనే కాని, గీత రచయితను కాను. అంచేత యీ నెల నా శ్లోకాలు హాలీడే తీసుకున్నాయి - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణ భగవానుడు" అని సమాధానం చెప్పగానే బేతాళుడు కళ్ల నీళ్లు పెట్టుకుని, గుండె బరువెక్కి ఎగరలేక, దొర్లుకుంటూ వెళ్లి యెలాగో అవస్థపడి మళ్ళీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments